క్లుప్తంగా

సాగర మాత ఆలయంలో ప్రార్థనలు



విజయపురిసౌత్: విజయపురి సౌత్‌లోని ప్రముఖ పుణ్యక్షేత్రం సాగర మాత ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ విచారణ గురువు పామిశెట్టి జోసఫ్ బాలసాగర్ మాట్లాడుతూ క్రీస్తు మార్గం అనుసరణీయమని పేర్కొన్నారు. అనంతరం దివ్యబలి పూజ కార్యక్రమం నిర్వహించారు. భక్తులు తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. తేరు ప్రదక్షిణలో భక్తులు భారీగా పాల్గొన్నారు.

వ్యర్థాల నిలయంగా రహదారి



శావల్యాపురం: మండల కేంద్రం శావల్యాపురం నుంచి వెళుతున్న గుంటూరు – కర్నూలు రహదారి వ్యర్థాలకు నిలయంగా మారింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలోని చెత్తను చెత్త సంపద కేంద్రాలకు తరలించాల్సి ఉండగా ఈ రహదారి వెంబటి కొంకెరు వాగు వద్ద ఇష్టానుసారంగా పడేస్తున్నారు. దీంతో రహదారి వ్యర్థాలకు నిలయంగా మారి దుర్గంధాన్ని వెదజల్లుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెత్త సంపద కేంద్రాలకు వ్యర్థాలు తరలించే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సంక్రాంతినాటికి పల్లెల్లో రోడ్లు పూర్తి



నాదెండ్ల: వచ్చే సంక్రాంతి నాటికి పల్లె సీమలన్నీ నూతన శోభ సంతరించుకోనున్నాయని నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు చెప్పారు. పంచాయతీరాజ్ వారోత్సవాల్లో భాగంగా అప్పాపురం గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ఆదివారం రూ.15 లక్షల వ్యయంతో నిర్మించే సీసీ రోడ్లు, సైడు కాల్వల నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పల్లె పండుగలో భాగంగా ప్రతి గ్రామంలో మౌలిక వసతుల అభివృద్ధికి నిధులు మంజూరు చేసి పనులు చేపట్టామన్నారు. కాంట్రాక్టర్లు నాణ్యతలో రాజీ లేకుండా పనులు చేయాలన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు బి.సత్యనారాయణ, జనసేన ఇన్‌చార్జి రాజారమేష్, సర్పంచ్ నారాయణమ్మ, ఎంపీటీసీ నెల్లూరి హరిబాబు, ఇన్‌చార్జి ఎంపీడీఓ స్వరూపరాణి తదితరులు పాల్గొన్నారు.

పీఆర్ విజ్ఞానకేంద్రంలో ఉచిత వైద్యశిబిరం



నాదెండ్ల: మండల కేంద్రం యడ్లపాడులోని పోపూరి రామారావు విజ్ఞాన కేంద్రంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. లింగారావుపాలెం విజన్ ఫౌండేషన్, యడ్లపాడు అభివృద్ధి కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో బీపీ, షుగర్ వ్యాధులకు సంబంధించి 260 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. వైద్యులు గుంటుపల్లి దివ్యతేజ, శొంఠినేని నవ్యశ్రీ పరీక్షలు నిర్వహించారు. రోగులకు పలు ఆరోగ్య సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో రావూరి దేవయ్య, కేతా రామబ్రహ్మం, ముత్తవరపు వేణుగోపాల్, పోపూరి శ్రీనివాసరావు, బొచ్చు రాజేష్‌కుమార్, ముత్తవరపు ధర్మతేజ, విజన్ ఫౌండేషన్ సభ్యులు సామినేని శ్రీనివాసరావు, సుమన్ పాల్గొన్నారు.

బాణసంచా అమ్మకాలకు అనుమతులు తప్పనిసరి

శావల్యాపురం: దీపావళి పర్వదినం సందర్భంగా బాణసంచా అమ్మకాలు నిర్వహించే దుకాణదారులు తప్పనిసరిగా పోలీసు అనుమతులు పొందాలని ఎస్‌ఐ లేళ్ల లోకేశ్వరరావు ఆదివారం తెలిపారు. స్థానిక పోలీసు స్టేషనులో మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలు ప్రకారం జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు బాణసంచా తయారుదారులు లైసెన్స్ కల్గియుండాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మాత్రమే దుకాణాలు ఏర్పాటు చేసుకుని అమ్మకాలు నిర్వహించాలన్నారు. ప్రతి దుకాణం వద్ద అగ్ని నిరోధక సామగ్రి అందుబాటులో ఉంచాలన్నారు. పోలీసు నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు.

‘ఆటో’ పోట్లు

- ప్రయాణం.. ప్రమాదం
- 9 గ్రామాలకు బస్సు సర్వీసు లేదు
- తప్పక ఆటోల్లో ప్రయాణిస్తున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు



ఆటోపైనా ప్రయాణికులను ఎక్కించుకుని వెళ్తున్న దృశ్యం

రెంటచింతల: గ్రామీణులకు ఆటోల్లో ప్రమాదకర ప్రయాణం తప్పడం లేదు. చాలా గ్రామాలకు బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రజలు ఆటోలను ఆశ్రయిస్తున్నారు. ఆటోవాలాలు నిబంధనలకు విరుద్ధంగా ఎక్కువ మందిని ఎక్కించుకుంటున్నారు. ఆటోలపైనా, వెనుక కూడా మనుషులను ఎక్కిస్తున్నారు. ఫలితంగా ప్రమాదాలు పొంచి ఉంటున్నాయి. రెంటచింతల మండలంలోని మంచికల్లు, రెంటాల, మిట్టగుడిపాడు, పాలువాయి, పశర్లపాడు, జెట్టిపాలెం, గోలి, మల్లవరం, తుమ్మకోట గ్రామాలకు బస్సు సౌకర్యం లేదు. మిగిలిన పల్లెలకు బస్సు సర్వీసు ఉన్నా.. సరైన వేళలు పాటించకపోవడంతో ప్రజలు ఆటోలను ఆశ్రయిస్తున్నారు. కూలి పనులకూ ఆటోల్లోనే



పరిమితికి మించి ప్రయాణికులతో వెళ్తున్న ఆటో

వెళ్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్ల ఆటోవాలాలు పరిమితికి మించి 15 నుంచి 20 మంది ప్రయాణికులను ఎక్కించుకుంటున్నారు. దీంతోపాటు గుంతలతో కూడిన రహదారుల వల్ల ఆటో ప్రమాదాలు తరచూ జరుగుతున్నాయి. చాలా మంది క్షతగాత్రులవుతున్నారు. కొన్నిసార్లు మరణాలూ సంభవిస్తున్నాయి. కుటుంబాల్లో చీకట్లు అలుముకుంటున్నాయి. కొందరు ట్రాక్టర్ ట్రక్కుకు ఉన్న మూడు వైపులా డోర్లను తెరిచి ప్రయాణికులను కూలి పనులకు తరలిస్తున్నారు. అయినా పోలీసు అధికారులు పట్టించుకోవడం లేదు. తనిఖీలు చేపట్టి చర్యలు తీసుకోవడం లేదు. ఇప్పటికైనా ఆటోవాలాలను నియంత్రించి ఆర్టీసీ అధికారులతో మాట్లాడి బస్సు సర్వీసులు నడపాలని గ్రామీణులు కోరుతున్నారు.

బస్సులు లేకే కష్టాలు



మా గ్రామం నుంచి ఏ గ్రామానికీ బస్సు సౌకర్యం లేదు. అందుకే ప్రమాదకరం అని తెలిసినా ఆటోల్లో కిక్కిరిసి ప్రయాణిస్తున్నాం. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని రోజూ బిక్కు బిక్కుమంటూ రాకపోకలు సాగిస్తున్నాం.

– దొడ్డా నర్సింహారావు, మల్లవరం గ్రామం

ఆటోలే దిక్కు



మా గ్రామానికి బస్సు సర్వీసు లేదు. ఆటోలే దిక్కు. సమయానికి పనులకు వెళ్లాలంటే ఉన్న ఆటోల్లో కిక్కిరిసి ప్రయాణించక తప్పదు. ప్రమాదం అని తెలిసినా రాకపోకలు సాగించాలి కదా..! రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. బస్సులు నడిపితే ఈ పరిస్థితి ఉండదు.

– వడితే భీమాలనాయక్, జెట్టిపాలెం గ్రామం

ఆటోవాలాలకు అవగాహన కల్పిస్తున్నాం



పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవడం ప్రమాదకరమని ఆటోవాలాలకు ఇప్పటికే అవగాహన కల్పిస్తున్నాం. ట్రాఫిక్ నిబంధనలు పాటించని, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకున్న ఆటోవాలాలకు ఖచ్చితంగా ప్రత్యేక కౌన్సెలింగ్ ఇస్తూ కేసులు నమోదు చేస్తున్నాం. పరిస్థితిలో మార్పు తీసుకొచ్చేందుకు కృషి చేస్తాం.

– సీహెచ్ నాగార్జున, ఎస్‌ఐ, రెంటచింతల

కార్యకర్తలతో కాసు సమావేశం



కార్యకర్తలతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి.

దాచేపల్లి : వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ఆదివారం పలు అంశాలపై చర్చించారు. నారాయణపురంలోని పార్టీ కార్యాలయానికి చేరుకున్న ఆయన గ్రామాల వారీగా కార్యకర్తలు, నాయకులతో మాట్లాడారు. గ్రామాల్లో పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. కార్యకర్తలు, అభిమానులకు అండగా నిలవాలని నాయకులకు సూచించారు. ఏ సమస్య వచ్చినా ఐకమత్యంతో కలిసికట్టుగా ఎదుర్కొందామని ధైర్యం చెప్పారు. అనంతరం అంజనాపురం కాలనీలో ప్రబలిన డయేరియా, బాధితులకు అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. పార్టీ తరుపున బాధితులకు అండగా నిలివాలని నాయకులకు సూచించారు. అయ్యప్పమాల దీక్ష విరమించిన తరువాత అంజనాపురం కాలనీ వచ్చి బాధితులను పరామర్శిస్తానని నాయకులతో మాజీ ఎమ్మెల్యే కాసు చెప్పారు. కాసు వెంట పార్టీ మండల, పట్టణ కన్వీనర్లు కోట కృష్ణ, షేక్ సుభానీ, ఎంపీపీ కందుల జాను, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యుడు కొప్పుల సాంబయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ జాకీర్‌హుస్సేన్, మాజీ సర్పంచ్ మందపాటి రమేష్‌రెడ్డి, సర్పంచ్ కూసం నాగిరెడ్డి, నాయకులు కొమెరబత్తిన విజయ్‌కుమార్, షేక్ ఖాదర్‌భాషా, మురుగుడు రఘు, చింతల దానియేలు, కొలా జంపాల రెడ్డి, నాళం శ్రీనివాసరావు, వంగా పద్మావతి తదితరులు ఉన్నారు.

బాలునాయక్ కుటుంబానికి అండగా ఉంటాం



బాలునాయక్ కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేస్తున్న దృశ్యం

మాచర్ల రూరల్: ఈనెల 20న మాచర్ల మండల పరిషత్ కార్యాలయంలో ఎంఆర్‌సీగా పనిచేస్తున్న బాలునాయక్ ఆకస్మిక మరణించడంతో ఆయన కుటుంబ సభ్యులకు స్వచ్ఛ భారత్ మిషన్ రాష్ట్ర అధ్యక్షులు తుమ్మా అయ్యపరెడ్డి రూ.32,000 ఆర్థిక సహాయాన్ని ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా అయ్యపరెడ్డి మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాల నుంచి అక్షరభారత్‌లో పనిచేస్తూ ఇటీవల ప్రభుత్వంలో వచ్చిన మార్పులలో భాగంగా స్వచ్ఛ భారత్ మిషన్‌లో మాచర్ల మండలంలో మండల పరిషత్ కార్యాలయంలో పనిచేస్తున్న బాలునాయక్ గుండెపోటుతో మరణించటం ఎంతో బాధాకరమన్నారు. వారి కుటుంబానికి తమ సంఘం అండగా ఉంటుందని, ప్రభుత్వం నుంచి రావాల్సినవన్నీ అందేలా చూస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఆర్‌సీలు పిచ్చయ్య, లక్ష్మయ్య, రామాంజనేయులు పాల్గొన్నారు.

కాపు టీచర్స్ అసోసియేషన్ ప్రమాణ స్వీకారం



కాపు టీచర్స్ అసోసియేషన్ నూతన జిల్లా కార్యవర్గ సభ్యుల ప్రమాణస్వీకారం

నరసరావుపేట రూరల్: ఆంధ్రప్రదేశ్ కాపు టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా కమిటీ, నరసరావుపేట, మాచర్ల నియోజకవర్గ నూతన కమిటీల ప్రమాణ స్వీకారం ఆదివారం వినుకొండ రోడ్డులోని రోటరీ క్లబ్‌లో నిర్వహించారు. జిల్లా కమిటీ అధ్యక్షునిగా రామిశెట్టి గోవిందరాజులు, ప్రధాన కార్యదర్శిగా యంగలశెట్టి ఏడుకొండలు, కోశాధికారిగా యాదాల రాజ్‌కుమార్, ఉపాధ్యక్షులుగా అంబటి చెన్నకేశవరావు, అదనపు ప్రధాన కార్యదర్శులుగా వేముల ఆంజనేయలు, గోవిందు శ్రీనివాసరావు, గౌరవ అధ్యక్షురాలిగా సింగంశెట్టి అన్నపూర్ణమ్మ, గౌరవ సలహాదారులుగా రాయల శ్రీనివాసరావులు ప్రమాణస్వీకారం చేశారు. అలాగే నరసరావుపేట నియోజకవర్గ గౌరవ అధ్యక్షుడిగా సుంకర శ్రీనివాసరావు, అధ్యక్షుడిగా గుబ్బా వెంకట రమణారావు, ప్రధాన కార్యదర్శిగా బత్తిని శ్రీనివాసరావు, కోశాధికారిగా తమ్మిశెట్టి బ్రహ్మయ్య, ఉపాధ్యక్షుడిగా ఒంటెద్దు కోటేశ్వరరావు, అదనపు ప్రధాన కార్యదర్శిగా తాడిపర్తి వెంకటేశ్వర్లు, రామలక్ష్మణ్, నల్లంశెట్టి రామసుబ్బారావు, మహిళా కార్యదర్శిగా శెట్టిపల్లి విజయలక్ష్మి, మాచర్ల నియోజకవర్గ గౌరవ అధ్యక్షుడిగా భీమా గోవిందరావు, అధ్యక్షుడిగా సిహెచ్ రాజేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా బూసి నాగలు ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమ పరిశీలకులుగా అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు హరిదాసుల లీలావేణుమాధవ్, వ్యవస్థాపక అధ్యక్షుడు పేరూరి ఫణీంద్ర, ఉపాధ్యక్షుడు చెన్నకేశవుల రమేష్‌లు వ్యవహరించారు.

రైతులకు అండగా ఉండాలి



రాయవరం జంక్షన్‌లో రైస్ మిల్లును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జేబీఆర్

మాచర్ల రూరల్: ఆరుగాలం శ్రమించే అన్నదాతలకు వ్యాపారులు అండగా ఉండాలని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి(జేబీఆర్) కోరారు. ఆదివారం మండలంలోని రాయవరం జంక్షన్‌లో మహాలక్ష్మి రైస్ ఇండస్ట్రీస్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. రైతన్నలు పండించిన పంటలకు సరైన గిట్టుబాటు ధర అందించి వారికి వెన్నుదన్నుగా ఉండాలని కోరారు. పండించిన ధాన్యాన్ని సుదూర ప్రాంతాలకు తీసుకువెళ్ళే పని లేకుండా వారికి అందుబాటులోనే రైస్ ఇండస్ట్రీస్‌ను ఏర్పాటు చేసిన వ్యాపారులకు ఆయన అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో రైస్ మిల్లర్స్ విడేల చెన్నకేశవరావు, గోపవరపు శేషగిరి, కామిరెడ్డి శ్రీనివాసరెడ్డి, విడేల కృష్ణ, కర్లపూడి లక్ష్మీనారాయణ, వట్టికొండ రాంబాబు, కాశీవిశ్వనాథం, టీడీపీ నాయకులు కేశవరెడ్డి, బ్యంగా లింగయ్య, కుర్రి శివారెడ్డి, సూరె యలమంద, ఆత్మకూరి నారాయణ, వంకాయల సూర్యనారాయణ పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల పెంపు నీతిమాలిన చర్య

- ప్రజలపై రూ.6,072కోట్ల విద్యుత్ బిల్లుల భారమే కూటమి ప్రభుత్వం దీపావళి కానుక
- ఎంఐఎం పట్టణ అధ్యక్షుడు మౌలాలి



నరసరావుపేట: తాము అధికారంలోకి వస్తే 30శాతం విద్యుత్ బిల్లులు తగ్గిస్తామని ప్రచారంచేసి ప్రజలచేత ఓట్లు దండుకున్న అధికార కూటమి నాయకులు ఇప్పుడు దీపావళి పండుగకు రూ.6,072కోట్ల భారం మోపటం నీతిమాలిన చర్య అని ఎంఐఎం పట్టణ అధ్యక్షుడు షేక్ మౌలాలి దుయ్యబట్టారు. ఆదివారం మీడియాతో మాట్లాడుతూ ఒకవైపు మూడు సిలిండర్లు ఉచితంగా ఇస్తామని చెబుతూ కరెంటు బిల్లులు పెంచి సామాన్య ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. కరెంటు బిల్లులు సాకు చూపిస్తూ మిగతా వాగ్దానాల అమలును ఎత్తేయటం కోసం ఇదొక ఎత్తు అన్నారు. ఏదైనా మాట తప్పడం చంద్రబాబుకే సాధ్యమని, ఇప్పటికి పెరిగిన నిత్యావసర సరుకులు, పెరిగిన కూరగాయల ధరలతో ఒకపూట తిని ఒక పూట పస్తులుండే పరిస్థితి నెలకొందన్నారు. ప్రభుత్వం పేద, మధ్య తరగతి ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకపోతే తమ పార్టీ తరపున రాష్ట్రవ్యాప్త ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

నిత్యావసర ధరలను తగ్గించాలి

- ఉచిత ఇసుక విధానంలో పారదర్శకత ఏదీ?
- సీపీఎం జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్



మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్

నరసరావుపేట: రాష్ట్రంలో పెరిగిన ధరలను తగ్గించాలని, ఉచిత ఇసుక విధానంలో మరింత పారదర్శకత పాటించాలని సీపీఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్ కుమార్ అన్నారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నిత్యావసర సరుకులు, కూరగాయల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని, సామాన్య, మధ్యత రగతి ప్రజల జీవన విధానం ఇబ్బందిగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉచిత ఇసుక విధానం అమలులో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని, ఇప్పటికీ ఇసుక దొరకక భవన నిర్మాణ, అనుబంధ రంగాల కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. పెరిగిన ధరలు నియంత్రించాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తూ ప్రజలపై భారాలు మోపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వచ్చే నెల 8వ తేదీ నుంచి 15 వరకు పెరిగిన ధరలకు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు, నిరసనలు, రాస్తారోకోలు నిర్వహించాలని రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పల్నాడు జిల్లాలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి తిరిగి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లో ఎండగట్టాలని పిలుపునిచ్చారు. కేంద్రంలో బీజేపీ అధికారంలో వచ్చిన దగ్గర నుంచి దళితులు గిరిజనులు, మైనారీలు వెనుకబడిన తరగతులు మహిళలపై అత్యాచారాలు, హింసా పెరిగిందన్నారు. వీటికి అరికట్టడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. గిరిజన ప్రాంతంలో జీఓ నెం.3 రద్దు చేయడంతో గిరిజనులు ఉపాధి అవకాశాలు, రిజర్వేషన్లు కోల్పోతున్నారని, తక్షణమే ఆ జీవోను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా జమిలీ పేరుతో ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిర్ణయానికి సీపీఎం వ్యతిరేకమని పేర్కొన్నారు. డిసెంబర్ ఒకటిన పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట పట్టణంలో జరగనున్న పార్టీ మహాసభలో నాయకులు, కార్యకర్తలు, సానుభూతిపరులు, రైతులు, కౌలు రైతులు, కార్మికులు, కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

వైద్యులు సేవాభావంతో పనిచేయాలి

- ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు
- ఐఎంఏ భవనంలో డాక్టర్ దత్తా హాస్పిటల్ ఆధ్వర్యంలో సీఎంఈ కాన్ఫరెన్స్



కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే చదలవాడ, డాక్టర్లను సన్మానించిన డాక్టర్ కృష్ణకాంత్ దంపతులు

నరసరావుపేట: వైద్యులు సేవాభావంతో పనిచేయాలని ఎమ్మెల్యే డాక్టర్ అరవింద బాబు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ఐఎంఏ హాలులో డాక్టర్ దత్తా హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన కంటిన్యూవస్ మెడికల్ ఎడ్యుకేషన్ (సీఎంఈ–2024) కాన్ఫరెన్స్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ నీతి, నిజాయితీ, మానవత్వం ఉన్నవాళ్లు డాక్టర్లు అని పేర్కొన్నారు. రోగులకు సత్వర న్యాయం చేయాలని, ప్రజలకు అండగా ఉండాలన్నారు. డాక్టర్లు 30 శాతం ఉచితంగా సేవ చేయాలన్నారు. గుండె, ఊపిరితిత్తులలో రక్తపు గడ్డల నివారణపై డాక్టర్ గార్లపాటి కృష్ణకాంత్, డాక్టర్ హిమజ, డాక్టర్ మహేశ్వరరావు మాట్లాడారు. వైద్యరంగంలో సమకాలీన పరిస్థితులలో ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. గౌరవ అతిథిగా పాల్గొన్న బులియన్ మర్చంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కపిలవాయి విజయకుమార్ మాట్లాడుతూ, ఇటువంటి కార్యక్రమాలు తరుచుగా జరగాలని ఆకాంక్షించారు. డాక్టర్లు కొండపల్లి వెంకటేశ్వర్లు, ఎల్ఎస్ రావు, గజ్జల బ్రహ్మారెడ్డి, కారసాని శ్రీనివాసరెడ్డి, కొండపల్లి వెంకటేశ్వర్లు, మన్నే గౌతమ్, శ్రీరామినేని సు. దీర్, కన్నెగంటి విద్యాసాగర్, నవులూరు క్రాంతి కుమార్‌రెడ్డి, అన్నా మణికంఠ సురేష్, యనమదల దివ్య, దేవరాశెట్టి శ్రీకాంత్, కనుమూరి రాజేష్, వై.వరబాబు, సూరా ప్రదీప్ కుమార్‌రెడ్డి, చదలవాడ చైతన్య, కూనిశెట్టి గౌతమ్, మిన్నెకంటి సునీల్‌చౌదరి, నంద్యాల రాంప్రసాద్‌రెడ్డి, శాఖమూరి బాజిబాబు, శ్రీరామినేని హిందూజ, యలమర్తి దమయంతి, ఓగురి కోటయ్య, ఓగురి భాను కళ్యాణ్, వినోద్ కుమార్‌రెడ్డి, యనమదల లక్ష్మి మానస, పాతూరి అశోక్‌తో పాటు సుమారు 120 మందికి పైగా పల్నాడు జిల్లా పరిసర ప్రాంతాలలో వైద్య సేవలనదిస్తున్న వైద్యులు పాల్గొని అనేక విషయాలపై చర్చించారు.

కిడ్నీ వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలి

డాక్టర్ వి.వెంకటనాయుడు

లక్ష్మీపురం: కిడ్నీ వ్యాధులపై ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకోవాలని డాక్టర్ వి.వెంకటనాయుడు అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో ఆరోగ్య సభ ఆదివారం నిర్వహించారు. డాక్టర్ మాట్లాడుతూ ప్రధానంగా మనం తీసుకునే నీరు, వివిధ ఆహార పదార్థాల మూలంగా మూత్రపిండాలలో రాళ్లు ఏర్పడతాయని వివరించారు. మధుమేహం ఉన్న వారిలో ఈ యూరినరీ ట్రాక్ ఇన్ఫెక్షన్ వచ్చే అవకాశం ఎక్కువ అని ఇన్ఫెక్షన్ వచ్చిన సమయంలో చలి జ్వరం, మూత్ర విసర్జనలో మంట లాంటి లక్షణాలు కనబడతాయన్నారు. అనంతరం అవగాహన సభ్యులు అడిగిన మూత్రపిండ సమస్యలకు సంబంధించిన విషయాలపై అవగాహన కల్పించారు. అనంతరం డాక్టర్ వెంకట నాయుడును ఘనంగా సత్కరించారు. సమావేశానికి టీవీ సాయిరాం కోఆర్డినేటర్ గా వ్యవహరించగా డాక్టర్ రమ్య, డాక్టర్ ఏ రవీంద్ర కుమార్, సీనియర్ యోగాచార్యులు ఇందు శేఖర్ పాల్గొని ప్రసంగించారు.

ముత్యాలమ్మ కొలుపులు ప్రారంభం

గురజాల : పట్టణంలోని ముత్యాలమ్మ కొలుపులు ఆదివారం నుంచి ప్రారంభమయ్యాయి. మొదటి రోజు ఉత్సవాలను ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి గ్రామోత్సవం చేశారు. అనంతరం బియ్యం కొలత కార్యక్రమం నిర్వహించారు. ఈ నెల 31తో చివరి రోజు వేడుకలు నిర్వహించనున్నారు. మహిళలు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

మొదటివారంలో పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభం

నాదెండ్ల: కేంద్ర ప్రభుత్వం కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ద్వారా పత్తి కొనుగోలుకు ఏర్పాట్లు చేసింది. ఈ నెల 28న రాష్ట్ర వ్యాప్తంగా సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలు ప్రారంభంకానున్నాయి. చిలకలూరిపేట ప్రాంతంలో దీపావళి అనంతరం నవంబర్ మొదటివారంలో సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభం కానున్నట్లు చిలకలూరిపేట ఏపీఎంసీ యార్డు కార్యదర్శి యు.జోగేశ్వరరావు తెలిపారు. క్వింటా మద్దతు ధర రూ.7521లకు కొనుగోలు చేయనున్నట్లు చెప్పారు. మొదటి విడతగా గణపవరం గ్రామంలోని వెంకటకృష్ణ కాటన్‌మిల్లులో ప్రారంభించనున్నారు.

మంచినీటి పైపులైనుకు మరమ్మతులు

నాదెండ్ల: యడ్లపాడు రక్షిత మంచినీటి పథకం భూగర్భ పైపులైను లీకేజీలు కారణంగా కొంతకాలంగా గృహ అవసరాలకు సరఫరా అయ్యే నీరు కలుషితమవుతోంది. దీనిపై గ్రామస్తుల నుంచి ఫిర్యాదులు రావటంతో పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టారు. జాతీయ రహదారి సర్వీసు రోడ్డు వద్ద ప్రధాన పైపులైను లీకైనట్లు గుర్తించి పొక్లెయిన్‌తో మరమ్మతులు నిర్వహించారు.

రాహు - కేతు పూజలు



నకరికల్లు: మండలంలోని నర్సింగపాడు గ్రామంలో ఉన్న అన్నపూర్ణా సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం రాహు – కేతు పూజలు నిర్వహించారు. గ్రామంలోని రాహు-కేతువులను దర్శించుకొని, పూజలు చేస్తే దోషాలు తొలగిపోయి కార్యసిద్ధి చేకూరుతుందని పల్నాడు ప్రాంతంలోని భక్తుల ప్రగాఢ విశ్వాసం. దీంతో పలు గ్రామాల నుంచి పలువురు భక్తులు కుటుంబ సమేతంగా తరలివచ్చారు. అర్చకులు కొమ్మవరపు పవన్ కుమార్ శర్మ ఆధ్వర్యంలో దోష నివారణకు రాహు-కేతుల పూజాధికాలు నిర్వహించారు. ప్రధాన ఆలయంలోని అన్నపూర్ణాదేవి అమ్మవారిని, కాశీ విశ్వేశ్వరస్వామి వారిని దర్శించుకొని మొక్కులు చెల్లించారు.

ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకోవాలి

ముప్పాళ్ళ(సత్తెనపల్లి): గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం గ్రాడ్యుయేట్‌లు ఓటు హక్కు నమోదు చేసుకోవాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర సహాయ కార్యదర్శి చిన్నం మణిబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వైస్సార్ సీపీ నాయకులు, అభిమానులు వారి పరిధిలో ఉన్న గ్రాడ్యుయేట్ ఓటర్ల వివరాలు సేకరించి, వారికి ఓటు హక్కు పొందేలా చూడాలని పేర్కొన్నారు. గ్రాడ్యుయేట్ ఓటు పొందేందుకు గాను ఫొటో, డిగ్రీ సర్టిఫికెట్, ఆధార్, ఓటరు కార్డు, ఫాం–18 పత్రాలు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఓటు నమోదు కొరకు డిగ్రీ ప్రొవిజినల్ సర్టిఫికెట్, ఆధార్ కార్డు, ఓటరు కార్డ్ ఒరిజినల్స్ తీసుకొని గజిటెడ్ ఆఫీసర్ చేత తప్పనిసరిగా సంతకం చేయించుకోవాలని తెలిపారు.

పశు గణనకు సహకరించండి

అమరావతి: మండలంలో ప్రస్తుతం నిర్వహిస్తున్న పశు గణన కార్యక్రమానికి రైతులందరూ సహకరించాలని పశుగణాభివృద్ధిశాఖ ఏడీ వెంకట్రామయ్య కోరారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ గ్రామాలలో డెయిరీ ఫాంలు, కోళ్ల ఫాంల నుంచి వివరాలు సేకరించటానికి యజమానులు సిబ్బందికి సహకరించాలని పేర్కొన్నారు. ప్రస్తుత నిబంధనల ప్రకారం గ్రామాలలో ఉన్న వీధి కుక్కలను కూడా గణన చేయాల్సిన అవసరం ఉందన్నారు. పశువుల ఆరోగ్యం, పునరుత్పత్తికి సంబంధించి అచ్చంపేట, అమరావతి మండలాలలోని 40 గ్రామాల్లో పశుగణన నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోని సహకరించాలని కోరారు.